క్లుప్తంగా

విత్తనాలు నాటిన విద్యార్థులు



విత్తనాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌జీసీ విద్యార్థులు పచ్చార్ల ప్రాజెక్టును శుక్రవారం సందర్శించారని హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి తెలిపారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఏడుకిలోల గుల్‌మొహర్, కుంకుడు, చింత తదితర విత్తనాలను నాటినట్లు ఆయన చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించామన్నారు. కో–ఆర్డినేటర్ అమరనాథ్, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, రెడ్డిరాణి, కుమారి, ఆంజనేయులు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో శాంతి హోమం



ప్రాయశ్చిత్త శాంతి హోమం నిర్వహిస్తున్న ఈఓ ఏకాంబరం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రాయశ్చిత్త శాంతిహోమం నిర్వహించారు. దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో దేవస్థాన వేదపండితులతో ఈ హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ప్రదానం



పుంగనూరు: శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు శుక్రవారం ఏఓ లోకనాథ్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 15 మందికి బి–క్యాడెట్ సర్టిఫికెట్లు, 15 మందికి పాస్ సర్టిఫికెట్లు, ఐదుగురికి బి–సర్టిఫికెట్లు అందజేశారు. వీరిని ఎన్‌సీసీ ఆఫీసర్ సోమరాజు అభినందించారు. అనంతరం మొక్కలు నాటి, ప్రపంచ టూరిజం దినోత్సవం నిర్వహించారు.

జీవన ప్రమాణాల మెరుగుకు ప్రణాళికల రూపకల్పన



వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గుడుపల్లె: జీవన ప్రమాణాలు మెరుగు పరచేందుకు ప్రణాళికలు సిద్ధ చేయాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక శ్రీ శక్తి భవనంలో వివిధ శాఖల అధికారులకు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై వర్క్ షాపు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఐదేళ్లలో ఆర్థిక, సామాజిక అభివృద్ధి, పర్యావరణ సుస్థిరతపై దృష్టి సారించాలన్నారు. అన్ని రంగాలలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలనే దిశగా వ్యవసాయం, కుటీర పరిశ్రమలు తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపకల్పన చేసి సమర్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలి



సదుం: అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. స్థానికంగా చౌకగా లభించే వాటితో చేసిన పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించారు.

సెల్ఫీ..క్లిక్..క్లిక్..!



పలమనేరు: స్వచ్ఛతా హి సేవాలో భాగంగా స్థానిక మున్సిపల్ అధికారులు శుక్రవారం పలమనేరు హైవేలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. తొలుత మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఆపై సిబ్బంది సెల్ఫీలను తీసుకున్నారు. తాము స్వచ్ఛతకు పాటుపడతామన్నారు. అనంతరం పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఇటు చూడు 'బాబూ'..!

సం'క్షామ' హాస్టళ్లు..!

- భవనాలు శిథిలం
- సమస్యలతో సహవాసం
- నీటి వసతి లేక అగచాట్లు
- పంచాయతీ కనెక్షన్ ఉన్నా అరకొరగా నీళ్లు
- ట్యాంకర్లతో నీళ్లు తెప్పించుకుంటున్న వైనం
- అధ్వానంగా మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కుప్పంలోని వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, వసతులు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యలు నివేదించినా పట్టించుకున్న స్పందించడం లేదనే ఆరోపణలొస్తున్నాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 4 దశాబ్దాలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నా కుప్పంలోని హాస్టళ్ల దుస్థితిపై ఆయన దృష్టి సారించిన పాపానపోలేదనే విమర్శలొస్తున్నాయి. విద్యార్థుల అభ్యున్నతికి అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పడం కాదు..చేతల్లో చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కుప్పం: 1982లో మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పంలో బీసీ, ఎస్సీ సామాజిక వర్గం పిల్లలు చదువుకునేందుకు స్థానిక మునుస్వామిపురంలో ఆయా వర్గాలకు వసతి గృహాలు నిర్మించారు. బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలు అధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో పేద విద్యార్థుల అభ్యున్నతికి ఇవి దోహదం చేశాయి. 40 ఏళ్ల కాలంలో ఇక్కడ కుప్పం, పలమనేరు నియోజకవర్గానికి చెంది ఎందరో విద్యార్థులు చదువుకున్నారు. ప్రస్తుతం ఈ హాస్టళ్లలో వివిధ ప్రాంతాలకు చెందిన 65 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల, ఆర్ పేట స్కూల్‌లో చదువుతున్నారు. కాలక్రమంలో భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం మూలాన పైకప్పు స్లాబ్ కమ్మీలు తేలిపోయి దుస్థితికి చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

నీటి వసతి లేని మరుగుదొడ్లు, స్నానపు గదులు

హాస్టళ్లలో స్నానపు గదులకు సరిగా నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్ల తలుపు పగిలి అధ్వానంగా ఉంటున్నాయి. 10 మరుగుదొడ్లు ఉన్నా ఒక్క దానికి కూడా నీటి సరఫరా లేదు. ఫలితంగా స్నానపు గదులు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉంటున్నాయి. ఇబ్బందుల నడుమే వీటిని వినియోగించుకోవాల్సిన దుస్థితి ప్రాప్తించింది. పంచాయతీ కనెక్షన్ ఉన్నప్పటికీ మూడురోజుకోసారి సరఫరా చేస్తుండటం వలన ఆ నీరు అవసరాలకు సరిపోవడం లేదు. డ్రమ్ముల్లో నిల్వ చేసుకుని పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది. ఫలితంగా అడపాదడపా ట్యాంకర్లతో సైతం నీళ్లను తెప్పించుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా హాస్టళ్ల నుంచి పట్టణంలోని స్కూళ్లకు వెళ్లడానికి దారి సౌకర్యం కూడా లేదు. హాస్టల్ పక్కనే ఉన్న కాలువ దాటి వెళ్లాలి. వర్షం వచ్చి కాలువలో నీరు ప్రవహిస్తే ఇంకా పాఠశాలకు డుమ్మా కొట్టాల్సిందే!

పట్టించుకోని ప్రభుత్వం

సంక్షేమ వసతి గృహాల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటూ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు అప్పటి జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్‌జైన్ ×హాస్టల్ నిద్ర× చేశారు. సమస్యలు తెలసుకుని హాస్టళ్ల రూపురేఖలు మారుస్తామని చెప్పి వెళ్లడం తప్పితే ఆ తర్వాత దీని ఊసే ఎత్తలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సేమ్ టు సేమ్ అదే తరహా సీన్ రిపీట్ అయ్యింది. రెండు నెలల క్రితం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇక్కడి హాస్టళ్లను తనిఖీ చేశారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన సమస్యలు ఉండడంతో వాటితోనే విద్యార్థులు భారంగా నెట్టుకొస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన వసతి గృహాలు



తలుపులు విరిగి అధ్వానంగా ఉంటున్న మరుగుదొడ్లు



నీటి సరఫరా లేని ఒక స్నానపు గది

నేడు వైఎస్సార్ సీపీ ప్రత్యేక పూజలు

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ప్రకాష్ రెడ్డి తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. అందరూ పాల్గొనాలని కోరారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

వి.కోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉర్దూలో హెచ్‌సీయు (హిస్టరీ, కామర్స్, ఉర్దూ) గ్రూపులో బోధించడానికి ఎంఏ లేదా బీఏ (ఉర్దూ) చేసి ఉండాలన్నారు. సీఎస్ఈ (కంప్యూటర్) బోధించడానికి బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ అర్హత, ఎంపీఏహెచ్‌డబ్ల్యూ (నర్సింగ్) గ్రూపులో అధ్యాపక పోస్టుకు ఎంఎస్సీ, బీఎస్సీ అర్హత కలిగి, సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10,000 ఇస్తామని, ఆసక్తికలిగిన అభ్యర్థులు ఈ నెల 30లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.

ఆర్డీఓ బదిలీ

- కొత్త ఆర్డీఓగా వెంకటేష్

పలమనేరు: పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన్ను జీఏడీ సెక్రటరీ టు గవర్నమెంట్(పొలిటికల్) వద్ద రిపోర్ట్ చేయాలని చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ నుంచి ఆదేశాలందాయి. అలాగే పలమనేరు ఆర్డీఓగా ఇప్పటిదాకా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి వద్ద ఓఎస్డీగా ఉన్న వెంకటేష్‌ను ఇక్కడికి ఆర్డీఓగా బదిలీ చేశారు. ఆర్‌డీఓగా బదిలీ చేశారు.



ఆలయం వద్ద నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

కల్యాణం.. కమనీయం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె కావమ్మ, మారయ్య ఆలయం వద్ద నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం ద్రౌపదీ కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ కనుల పండువగా నిర్వహించారు. పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఇక్కడ మహాభారతం నిర్వహిస్తుండటం విదితమే. మల్‌రెడ్డి, నారాయణ దంపతులు కంకణధారులై కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత వేద పండితులు పాండవ, ద్రౌపదీదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం తంతు ముగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం జ్యోత్స్న హరికథాగానం చేశారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, చిన్న రమణ, రామాంజులు, దుర్గారెడ్డి తదితరులు హాజరయ్యారు.

హెడ్ కానిస్టేబుల్‌కు నివాళి



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటాచలపతికి శుక్రవారం పలువురు నివాళులు అర్పించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ కలిసి శ్రీనివాసనగర్‌కు వెళ్లి వెంకటాచలపతి మృతదేహానికి పూలమాల వేసి నివాళి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ చెంగారెడ్డి, నాయకులు చంద్రప్ప, మురళి పాల్గొన్నారు.

పలమనేరు సర్వేయర్‌గా వెంకటరమణ



పలమనేరు: పలమనేరు మండల సర్వేయరుగా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తాను మండలంలోని సర్వే సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తానని ఆయన చెప్పారు.

సబ్ రిజిస్ట్రార్‌గా సర్వేశ్వర్‌రెడ్డి



సర్వేశ్వర్‌రెడ్డి

పుంగనూరు: పుంగనూరు సబ్ రిజిస్ట్రార్‌గా సర్వేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బాలాజీని శ్రీకాళహస్తికి బదిలీ చేశారు. బంగారుపాళ్యం నుంచి సర్వేశ్వర్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల మేరకు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్తిస్తానని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రజలు నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.

భక్తిప్రపత్తులతో కోనేటిరాయుని పవిత్రోత్సవాలు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో వేదపండితులు స్వామివారికి ఆరాధన, పుణ్యాహవచనం ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణతో స్వామివారికి పూజా కైంకర్యాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్థికాభివృద్ధిలో పర్యాటక రంగమూ కీలకమే



కల్లూరులో విద్యార్థులతో ర్యాలీ

కల్లూరు(పులిచెర్ల): పర్యాటక రంగం కూడా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని యువ టూరిజం క్లబ్ సమన్వయకర్త వనపర్తి వెంకట సిద్ధులు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీవాణి మాట్లాడుతూ, టూరిజంతో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, ప్రాంతాల చరిత్ర, వివిధ భాషలు, వేషధారణ తెలుస్తుందన్నారు.దీనితో పాటు దేశ ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. కొన్ని దేశాలు పూర్తిగా పర్యాటకం రంగంపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు రాజేంద్ర ,రాజశేఖర్, విమలా విక్టోరియా, ప్రకాష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారి మృతికి మాకు సంబంధం లేదు'

పుంగనూరు: పట్టణంలోని నక్కబండకు చెందిన చిన్నారి సాత్విక్‌నందన్ మృతిలో డాక్టర్ నిర్లక్ష్యం లేదని, మందులు వికటించలేదని డాక్టర్ కార్తీక్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న సాత్విక్ తల్లిదండ్రులు ఆసుపత్రికి 6 గంటల సమయంలో వచ్చి మందులు తీసుకెళ్లారని, అదే రాత్రి 8.40 గంటలకు బిడ్డకు పార పోవడంతో బిడ్డ చనిపోయినట్లు డాక్టర్ తెలిపారు. ఆ సమయంలో సుమారు 30 మంది తనపై దాడి చేసి కొట్టారని, ఆ పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తలదాచుకున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, తనపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు కుప్పం విద్యార్థులు





వ్యాయామోపాధ్యాయుడు లోకనాథంతో చందం విద్యార్థిని రమ్య, టి. సదుమూరు నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్న విద్యార్థులతో అధ్యాపక బృందం

కుప్పం రూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు కుప్పం మండలంలోని టి. సదుమూరు, చందం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం పెద్దతిప్పసముద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 నెట్‌బాల్ పోటీల్లో చందం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రమ్య ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మార్కొండనాయుడు తెలిపారు. అలాగే, జిల్లా కేంద్రంలో జరిగిన అండర్ –17 అథ్లెటిక్స్‌లో టి. సదుమూరు పాఠశాలకు చెందిన మంజుశ్రీ 800 మీటర్లలో మొదటి స్థానం, కోకిల 1500 మీటర్లలో ద్వితీయ సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరాజు, వ్యాయామోపాధ్యాయుడు ప్రకాశ్‌లు తెలిపారు. వీరు ముగ్గురూ అక్టోబరులో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



సదుం: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి

సదుం: ఎంజేపీ బాలుర గురుకుల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం తెలిపారు. చిత్తూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–17 వాలీబాల్ పోటీలలో లోహిత్ కుమార్, రన్నింగ్, లాంగ్‌జంప్ పోటీలలో మహేందర్ నాయుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. వీరు శ్రీకాకుళంలో జరిగే పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలియజేశారు. విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు.

అలరించిన సాంస్కృతికం





కాణిపాకం: వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక సందడిగా కనిపించింది. కళాకారులు తమదైన శైలిలో ఇచ్చిన ప్రదర్శనలు తన్మయత్వం చెందారు. ప్రధానంగా కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. గీతాలాపన, పౌరాణిక నాటిక ప్రదర్శన రంజింపచేశాయి.





పారిశుధ్యం మెరుగుపై దృష్టి



ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

వి.కోట: ఇటీవల విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈఓ శివ శంకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు పత్రపల్లె, పి.కొత్తూరు, గోవిందనగర్‌లో పారిశుధ్య పనులు చేశారు. ఈఓ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకుంటూ ఉండాలని కోరారు. దుర్గానగర్, వాణి కాలేజీ రోడ్, కొత్తూర్ రోడ్డు, గెస్టింపల్లె రోడ్, గ్రీన్ సిటీ ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు.